41.

# అహం - ఆత్మ - మనస్సు - వాక్కు

దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతం
తత్ సత్యం ఉత్తమాధీనం ఉత్తమో పరదేవతా!

ప్రేమస్వరూపులారా!

మన భారతదేశము తరతరములనుండి ప్రపంచములో ప్రతిదేశమునకు అనంతమైన ఆధ్యాత్మికతత్వము ప్రబోధిస్తూ వచ్చింది. తరతరములనుండి సుస్థిరమైన శాంతి భద్రతలను చేకూర్చటానికి ఆధ్యాత్మికతత్వమే ప్రధానమైన ప్రసాదంగా విశ్వసిస్తూ వచ్చింది. భారతీయులు కూడ అత్యంత భక్తి ప్రపత్తులతో, దివ్యమైన భావములతో, నవ్యమైన జీవితములో సుస్థిరమైన, శాశ్వతమైన స్థిరత్వమును పొందటానికి ప్రయత్నిస్తూ వచ్చారు. కానీ కాల ప్రభావముచేత, కలియుగ ప్రభావముచేత, ఈనాటి మానవత్వము ఆత్మవిశ్వాసము లేక అన్యవిశ్వాసములు అభివృద్ధిపరచుకొని అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన జగత్‌వ్యాప్తికై అనేకవిధములుగా పాటుపడుతున్నారు. పశుపక్షి మృగాదులకున్న విశ్వాసము యీనాడు మానవులకు లేకుండా ఉంది. ఒక చిన్న పక్షి లేతకొమ్మపై వాలినప్పుడు ఆ కొమ్మ అటు యిటు ఊగుతుంది. కానీ ఆచెట్టు కొమ్మ ఊగినా ఈ పక్షి అదరదు బెదరదు. కారణం? ఆ పక్షి ఆ కొమ్మను ఆధారం చేసుకోలేదు. తన రెక్కలపైన ఆధారపడటంచేతనే ఈ కొమ్మ ఏవిధముగా ఊగినప్పటికిని తానే మాత్రము భయ భ్రాంతులకు గురి కావటం లేదు. పక్షి తన రెక్కలను ఆధారము చేసుకొని విశ్వసించినప్పటికిని ఈనాటి మానవుడు తన హృదయాన్ని, తన ఆత్మతత్వాన్ని విశ్వసించక తాను అనేక రకములైన చింతలకు గురౌతున్నాడు.

**విశ్వాసాన్ని పెంచుకో**

మానవుడు అనేక ప్రసంగములు వింటున్నాడు. అనేక గ్రంథములు పఠిస్తున్నాడు. అనేకమంది పెద్దల ఉపన్యాసములు వింటున్నాడు. వింటున్నంత వరకు ఆనందంగా

sri sathyasaivahiniamrutam

తలలూపటం, ఏదో తాము స్వీకరించినట్టుగా భావించటం జరుగుతున్నదిగానీ విశ్వసించి, ఆచరణలో పెట్టే వ్యక్తి ఒక్కడైనా కనిపించటం లేదు. ఆత్మవిశ్వాసము కల్గిన మానవునకు ఎట్టి సందేహమునకు అవకాశము ఉండదు. ఎట్టి భయభ్రాంతులు చేకూరినా తాను దిగులొందక, ఆత్మవిశ్వాసముపై ఆధారపడి ఉంటాడు. అన్నింటిని ఎదుర్కొని తాను ధైర్యసాహసములతో ముందంజ వేస్తున్నాడు. కానీ ఆధ్యాత్మిక మార్గమందు వెనుకంజ వేస్తున్నాడు. అనాది కాలమునుండి భారతీయ సంస్కృతి పవిత్రమైన ఆత్మవిశ్వాసమునే ఆధారం చేసుకొని జీవిస్తూ వస్తున్నది. ఈ ఆధునిక యుగము ప్రారంభమైనప్పటి నుండి ఆత్మవిశ్వాసము దిన దినమునకు తరిగిపోతున్నది. ప్రతి మానవునికి విశ్వాసము అత్యవసరము. ఈ ఆనందము కేవలం విశ్వాసము ద్వారానే మనకు లభ్యమవుతున్నది. ఏ చిన్న కార్యమునందైనా విశ్వాసము లేకుండిన మనకు ఆనందము లభ్యము కాదు. కనుక ఆత్మవిశ్వాసము ఆధారము చేసుకొని మనం జీవించటానికి ప్రయత్నించాలి.

### విజయదశమి విశిష్టత

తనను తాను గుర్తించుకోలేని మానవుడు ఎన్ని గుర్తించి ప్రయోజనం ఏమిటి? ప్రపంచములో ఏమేమి జరుగుతున్నదని ప్రతి మానవుడు తెల్లవారి లేచిన తక్షణమే న్యూస్ పేపరు తీసుకొని విచారణ చేస్తుంటాడు. దేశ దేశముల యొక్క విషయములను, కాలముల యొక్క విషయములు గుర్తించటానికి ప్రయత్నిస్తున్నాడు గానీ తననుండి వచ్చే విశ్వాసాన్ని ఏమాత్రం గుర్తించుకోటం లేదు. ఎవరిని చూచినా ఎవరు నీవు? ఎక్కడ నుండి వచ్చావని? ప్రశ్నిస్తాము. కానీ మానవుడు తనను తాను గుర్తించుకోటం లేదు. తనను తాను ప్రశ్నించుకోటం లేదు. నేనెవరు? నేను ఎక్కడనుండి వచ్చాను? అనే సత్యమును ఏమాత్రము విచారించటం లేదు. ఈవిధమైన ఆత్మవిశ్వాసము లేకపోవటంచేత ఎన్ని సాధనలు చేసి ప్రయోజనం ఉండదు. దీనికి తగినట్టుగా ఆహార విహారములు చాలా మార్పు చెందుతూ వచ్చాయి. ఈ మానవత్వములో చిత్త శుద్ధి లేకపోవటము మూలకారణము ఆహారమే.

srisathyasaivachanamrutam

## అన్నదోషం

పాండవులు విజయము సాధించిన తరువాత, కృష్ణుడు ఈ పాండవులను తాత భీష్ముని దగ్గరకు తీసుకువెళ్లి శాంతి పర్వము బోధింపచేశాడు. భీష్ముడు చాలా ఆనందించాడు. అందరు నిశ్శబ్దంగా ఉండిన సమయములో భీష్ముడు అనేక విధములుగా బోధిస్తున్నాడు. వీటినన్నీ శ్రద్ధాభక్తులతో వింటున్నారు. భీష్ముడు బోధించిన పర్వమే శాంతిపర్వము. 'నాయనా! మానవులంతా యీ విధంగా జీవించాలి. ఈవిధంగా నివశించాలి. ఈవిధంగా బ్రతకాలి అని బోధిస్తున్నాడు. ప్రశాంతంగా అందరు శ్రవణం చేస్తున్న సమయంలో ద్రౌపది ఫక్కున నవ్వింది. కాని ఆమె సభా గౌరవము గుర్తించిన వ్యక్తి, మహా గొప్పగుణము కల్గినవ్యక్తి. సంఘ సంస్కారములు చక్కగా గుర్తించిన వ్యక్తి, విచాక్షణా జ్ఞానము గుర్తించిన వ్యక్తి, వివేకము కలిగిన వ్యక్తి, విచక్షణ కలిగిన వ్యక్తి. ఇలాంటి వ్యక్తి ఈ సభలోపల నవ్వుటకు కారణము ఏమిటని భీమునకు కోపం వచ్చింది. అర్జునునకు కోపం వచ్చింది. ధర్మరాజు తలవంచుకున్నాడు. అందరికీ అవమానకరమైన చర్య జరిగిందని చాలా బాధపడుతూ వచ్చారు. కానీ ద్రౌపది నవ్వటానికి కారణమేమిటో భీష్మునికి తెలుసు. మెత్తగా ద్రౌపదిని దగ్గరకు పిల్చాడు. బిడ్డా! నీ నవ్వునకు లోకులు అనేక రకములైన అర్థములు గావించుకుంటున్నారు. లోకులు కాకులు. సత్యాన్ని గుర్తించుకొనలేక మానవులు ఈ విధమైన చర్యలకు పూనుకుంటారు. నీ నవ్వునకు కారణము ఏమిటో వారికి చక్కగా చెప్పి సందేహము నివారించమన్నాడు. అప్పుడు భీష్ముని ఆజ్ఞ పురస్కరించుకొని 'తాతగారూ! మీరు యిప్పుడు బోధించుతున్న బోధలన్నీ దుర్మార్గులు, దుష్టులు అయిన కౌరవులకు బోధించవలసినది. కానీ నా పతులు చాలా ధర్మాత్ములు, పవిత్ర హృదయులు, నిశ్చలము, నిస్వార్థము కల్గిన హృదయులు. అలాంటి వారికి యీ బుద్ధులు బోధించే అవసరము లేదు. యింతకాలము మీరు కౌరవులకు అధిపతిగా ఉన్నారు. కౌరవులకు సైన్యాధిపతిగా ఉంటున్నావు. ఈ బోధలన్నీ కౌరవులకు ఎందుకు బోధించలేదు. మీ సర్వబోధలు ఆచరణలో పెట్టిన పాండవులకు బోధించటంలో నున్న అంతరార్థము ఏమిటని నాకు నవ్వు వచ్చింది' అన్నది. అప్పుడు భీష్ముడు చెబుతున్నాడు 'అమ్మా! నీవు నవ్వటములో కారణము, యదార్థము ఉన్నది. అయితే నేనింతకాలము కౌరవులకు సమీపంలో ఉండటంచేత, కౌరవ

సంఘములో చేరటంచేత, కౌరవులు పెట్టిన భోజనం చేయటంచేత, కౌరవుల దుస్సంగము పూనటంచేత నా భావములు రక్తము దుర్భావమైనాయి. వారి ఆహారము భుజించటంచేత అన్యాయ, అక్రమ, అనాచారము, అసత్యములతో కూడిన ఆహారము నేను తినటంచేత నా రక్తము కూడా అపరిశుద్ధముగా మారిపోయింది. కనుక ఈ రక్తము ప్రభావముచేత నా మనస్సు కూడా మాలిన్యమై పోయింది. ఇంతకాలము కౌరవులు చేసేది తప్పు అని తెలిసి కూడను వారికే మాత్రము బుద్ధి చెప్పలేకపోయాను. కానీ అదృష్టవశాత్తు అర్జునుడు అంబులను విడచటం చేత నాదేహములోని రక్తము ఈ 56 దినములు కారిపోయింది. ఆ రక్తము అంతా కారిపోవటం చేత అడుగున నున్న పవిత్రమైన రక్తము బయటపడుతున్నది. ఇప్పుడు సద్భావములన్నీ వెలుపలకు వస్తున్నవి. ఇంతకాలము రాకుండా పోవటానికి కారణము ఆ చెడ్డ ఆహారదోషమే. మాలిన్యమైన రక్తము దీనినంతా అణగద్రొక్కింది. సంగదోషము నా ప్రభావాన్ని ఆవిధంగా మార్చివేసింది. ఈ విషయాన్ని గుర్తించి విదేశీయులు ఏవిధంగా చెప్పారు? Tell me your company, I shall tell you what you are అని. మనము ఎలాంటి వారితోసాంగత్యము చేస్తామో అలాంటి భావాలు ప్రవేశిస్తాయి. భీష్ముడు సత్యవ్రతుడు. తండ్రికోసమై సర్వకష్టములకు గురౌతూ వచ్చాడు. అడ్డు తగిలిన దుఃఖములను, విచారములను, కష్టములను అన్నివిధాలా ఎదుర్కొన్నాడు. వాటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగినవాడే భీష్ముడు. అలాంటి భీష్మునికి ఈ విధమైన గతి రావటానికి కారణం ఏమిటి? ఈ దురాచార సంబంధమైన ఆహారము నేను భుజించటం చేతనే నాలో దుర్భావములు అభివృద్ధి అవుతూ వచ్చాయి. కనుకనే యీనాటి ధర్మములు ఆనాడు బోధించలేకపోయాను అన్నాడు.

ప్రతి బోధ కాల, కర్మ, కర్తవ్యములను పురస్కరించుకొని దేశకాల పరిస్థితులు పురస్కరించుకొని, ఈవిధమైన బోధలు ప్రారంభమవుతాయి. అర్జునుడు, కృష్ణుడు కలసిమెలసి ఉండేవారు. కానీ ఏనాడు భగవద్గీత కృష్ణుడు అర్జునునికి బోధించలేదే. కానీ సమయము రావాలి. దేనికైనా కాలమును ప్రసన్నత చేసుకోవాలి. కాలము చాలా అత్యవసరము. **"కాలకాల ప్రసన్నానాం కాలః కిం కరిష్యతి"** అని కాలమును ఆదర్శముగా తీసుకున్నప్పుడే కాలమే సంరక్షిస్తూ వస్తుంది. కనుక కాలంకోసం నేనింత కాచుకున్నాను

sri sathyasaivachanamrutam

అని చెప్పి తన ఆహార పరిస్థితి ప్రభావాన్ని చక్కగా సమావేశములో ప్రబోధిస్తూ వచ్చాడు భీష్ముడు.

**సంఘదోషం**

మానవుని భావములు పవిత్రమైనవిగా ఉండినప్పటికిని కొన్ని సంఘ దోషములచేత అవన్నీ అడుగున పడిపోతున్నాయి. ఎన్నియో పవిత్రమైన విషయాలు మీరంతా శ్రవణం చేశారు. ఎన్నియో పవిత్రమైన గ్రంథములు మీరు పఠించారు. పవిత్రమైన దర్శనాలు చేసుకున్నారు. కానీ ప్రయోజనం ఏమిటి? అవన్నీ నీ ఆహార పరిస్థితుల ప్రభావముచేత అట్టడుగున పడిపోయాయి. ఈ సమయం వచ్చేటప్పటికి ఆ రక్తం అంతా పోయింది. అప్పుడే సద్భావములు పైన పడుతున్నాయి. మనయందున్న సద్భావములు రావటానికి కొన్ని దుర్భావములు అడ్డుపడుతుంటాయి. ఈ దుర్భావములు దూరము చేయటానికి తగిన కృషి చేయాలి ప్రతి మానవుడు. మనం ఒక గృహము నిర్మించుకున్నాం. ఈ గృహమునకు ఒక సింహద్వారం పెట్టుకున్నాం. తిరిగి గాలి రావటానికి, పోవటానికి కిటికీలు అమర్చుకున్నాం. ద్వారము అమర్చుకున్నామని బజార్లో పోయే పందులను, గాడిదలను లోపలకు వదలం. నీ మిత్రులు, నీ బంధువులు వచ్చినప్పుడు మాత్రమే యీ తలుపులు తెరుస్తావు. అదే విధముగా ఈ దేహమనే దేవాలయమునకు అనేక కిటికీలు ఇంద్రియములుగా ఉన్నాయి. మనలో నుండిన మనస్సు యొక్క ప్రభావము, సింహద్వారంగా ఉన్నాది. ఎవరికి అందులో ప్రవేశము యివ్వాలి, ఎవరికి యివ్వకూడదు అని నిత్యానిత్య విషయ పరిశీలన చేయాలి. కనుక యీనాడు అట్టి పరిశీలన చేయక, విచారణ చేయక, ఎవరు పడితే వారు లోపలకు ప్రవేశిస్తున్నారు. దుర్మార్గులు, దుష్టులు, దుష్ప్రచారకులు యిందులో ప్రవేశిస్తున్నారు. అడ్డులేని పరిస్థితి ఏర్పడటం చేత జీవితము హద్దులేని జీవితముగా తయారవుతున్నది. ప్రతిదానికి **"న శ్రేయో నియమం వినా"**. ప్రతిదానికి ఒక నియమం ఉండాలి. అందరిని మనం చేరకూడదు. అందరితోను సంభాషించకూడదు. అందరితోను స్నేహం చేయకూడదు. మనము నిత్యానిత్య విషయ పరిశీలన చేసి మంచివాడా కాదా అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. అయితే ఎవరినీ నీవు ద్వేషించవద్దు. అద్వేష్టా సర్వభూతానాం. ఎవరియందు ద్వేషభావము పెట్టుకోకూడదు. కానీ

srisathyasaivachanamrutam

ప్రేమ భావము చేత హద్దుమీరి లోపల ప్రవేశింపచేయకూడదు. ఎంతలే వుంచాలో అంతలోనే వుంచాలి. పరిమితమైన పరిచయము మనం పెట్టుకోవాలి. ఈ పరిమితి మీరిన తరువాత హద్దు మీరిపోతుంది. తిరిగి మనం control చేయటం చాలా కష్టమైపోతుంది.

**మంచి గుణాలు పెంచుకోండి**

మానవుడు మానవత్వాన్ని కొంతవరకు కాపాడుకోవాలి. ఈనాటి మానవుడు మానవతా విలువలు కాపాడుకోలేకపోవటంచేత యిన్ని విధములైన దురాచారములకు గురౌతున్నాడు. మానవుడై పుట్టి, మానవతా గుణములు మానవునిలో ప్రవేశించకుండాపోతే యింక మానవుడై పుట్టినందుకు ప్రయోజనం ఏమిటి? కనుక మానవుడై పుట్టినందుకు మానవతాగుణములు మనం పోషించుకోవాలి. మొట్టమొదటిది సత్యము. ఈ సత్యమును మనం సంరక్షించు కోవాలి. రెండవది ధర్మము. ధర్మాన్ని మనం ఆచరించాలి. దీనిని పురస్కరించుకొని వేదమందు **'సత్యంవద ధర్మంచర'** అన్నారు. ఈ రెండింటి తరువాత శాంతి. శాంతి మానవునికి ఒక ప్రధాన ఆభరణము. ఈ శాంతి లేక ఏమాత్రము సౌఖ్యము లేదు. కనుక త్యాగరాజు శాంతము లేక సౌఖ్యము లేదు అన్నాడు. అన్నింటికి ప్రేమ ప్రధానప్రాణం. కనుక సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ యీనాల్గింటిని మానవతా గుణములుగా స్వీకరించాలి. తద్వారా మానవతా గుణములను అభివృద్ధి గావించుకుంటూ పోవాలి. ఈనాడు మానవుడు ఆకారముగా కనిపిస్తున్నాడు గానీ మానవతా గుణములు ఆచరణలో వెనుకబడి పోతున్నాడు. ఆకారములో మానవుడు, ఆచారములో రాక్షసుడుగా ఉంటున్నాడు. మానవాకారముతో నున్నప్పుడు మానవతా గుణములు మనం సంరక్షించుకోవాలి. ఈనాటి మానవుని యందు మానవతా గుణములు ఏమాత్రం కనిపించటం లేదు. కొన్ని కొన్ని పరిస్థితులందు, కొన్ని కొన్ని ప్రదేశములందు అప్పుడప్పుడు ఒక show గా కనిపిస్తుంటాయి. యిది సరైనది కాదు. ప్రతి మానవతాగుణము మన హృదయము నుండి ఆవిర్భవించాలి. యిదేమి exhibition కాదు ప్రదర్శించటానికి. ఈ మానవతా గుణములు నిదర్శనమునకు గానీ ప్రదర్శనమునకు కాదు. ఆచరణలో పెట్టి రక్తములో ప్రవేశపెట్టాలి. నఖశిఖ పర్యంతం దీనిని సంచరింపచేయాలి. ఏమాట చెప్పినా, ఏపని చేసినా, ఏతలంపు తలచినా, మానవతా గుణములను మనం చక్కగా విచారించాలి.

sri sathyasaivecharamrutam

ఈనాడు ఏమాత్రము విచారించటం లేదు. ఏమి తలచినా, ఏది చెప్పినా, ఏమి చేసినా స్వార్థము, స్వప్రయోజనమే. ఈ స్వార్థ స్వప్రయోజనముల చేత మానవతా గుణములు పూర్తి శూన్యమై పోతున్నాయి. కనుక మానవతా గుణములు సంరక్షించుకోటానికి మొట్టమొదట ఆహార, విహారములు అత్యవసరము. కనుక సరైన ఆహారమును తీసుకోవాలి. Food ఎలాంటిదో head అలాంటిది. Head ఎలాంటిదో God అలాంటిది. కాబట్టి food, head, god మూడింటి సమన్వయము మనం చక్కగా గుర్తించుకోవాలి. ఇది ఏవిధంగా ఉంటున్నాది? చిన్న ఉదాహరణ. మీకు తెలుసు. ఇక్కడ బల్బులు వెలుగుతున్నాయి. బల్బులు వెలుతురు నిస్తున్నాయి. బల్బు ప్రధాన మనుకుంటే దానిలోపల వైర్ చేరాలి. వైరుండినంత మాత్రమున ప్రయోజనం లేదు. దానిలో కరెంటు ప్రవేశించాలి. కాబట్టి ఈ కరెంటు వైరులో ప్రవేశిస్తుంది. బల్బులో ప్రవేశించినప్పుడు బల్బు ప్రకాశమునందిస్తుంది. ఆ ప్రకాశమే ప్రేమ. ఈ ప్రేమ అనే ప్రకాశము మనకు రావాలంటే శాంతి అనే బల్బు ఉండాలి. ఈ శాంతి బల్బు వెలగాలంటే ధర్మము అనే వైరు ప్రవేశించాలి. ధర్మమనే వైరులో సత్యమనే కరెంటు ప్రవేశించాలి. సత్యమే కరెంటు, ధర్మమే వైరు, శాంతమే బల్బు, ప్రేమయే ప్రకాశము. కరెంటు లేక బల్బు ప్రకాశము మనం అందుకోలేము. మన హృదయమునందు ప్రేమ ప్రకాశించాలంటే దీనికి ధర్మము, శాంతి, సత్యము యీమూడు తోడుగా ఉండాలి. ఇవన్నీ మానవత్వములో త్రికరణ శుద్ధిగా ఉండాలి.

**ఆత్మనుండే అన్నీ వచ్చినవి**

మీకు అనేక పర్యాయములు చెప్పాను. ఆత్మకు కుమారుడు అహం. అహం కుమారుడే మనస్సు. మనస్సు యొక్క కుమారుడే వాక్కు. అహం కుమారుడు, మనస్సు grandson. మనస్సుకు పుట్టిన వాక్కు great grand son. మునిమనుమడు, మనుమడు, కుమారుడు, తండ్రి నలుగురు ఒక కుటుంబీకులే కదా! ప్రతి మానవునికి అహం ఉంటున్నది. ఈ అహం ఆత్మనుండి ఆవిర్భవించినదే. అహం నుంచి వచ్చిన మనస్సు ఆత్మనుండి ఆవిర్భవించినదే. ఈ మనస్సు నుండి వచ్చిన వాక్కు ఆత్మనుండి వచ్చినదే. దీనిని మనం మొట్టమొదట గుర్తు పెట్టుకోవాలి. ఒక్క కుటుంబీకులు మేమందరము. ఆత్మ కుటుంబీకులు. వాక్కు ఆత్మ భావంలో ప్రవేశించాలి, మనస్సు కూడా ఆత్మభావంలో

sri sathyasai vachanamrutam

ప్రవేశించాలి. అహం కూడా ఆత్మభావంలో ప్రవేశించాలి. మనస్సు, అహం, వాక్కు మూడింటితో కూడిన ఆత్మగా ఉండినప్పుడే నీవు పూర్తి మానవుడుగా అవుతావు. దీనిని పురస్కరించుకొనే వేదము

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

ఈ పూర్ణమైన మానవత్వం మనకు ప్రాప్తించాలంటే ఈ మూడింటి ఏకత్వము కావాలి. హృదయమునుండి వచ్చిన మనస్సు యొక్క ప్రభావము మాటలో ప్రవేశించిన సత్యము క్రియతో ఆచరించాలి. కనుక ఆచరణ చాలా అవసరమైనది. ఆచరణ మనస్సు నుండి వచ్చేది. మనస్సు అహం నుండి వచ్చేది. అహం ఆత్మ నుండి వచ్చేది. ఈ మూడింటి యందు ఆత్మభావమే ఉండినప్పుడు ఏవిధమైన దోషములు చేయలేము. కానీ ఈనాడు మనస్సుకు గానీ, వాక్కుగానీ, క్రియకుగానీ ఆత్మతో ఎట్టి సంబంధము లేకుండా ఉన్నాయి.

**మనస్సన్యత్, వచస్సన్యత్ కర్మణ్యన్నత్ దురాత్మనామ్.**

అందువల్లే మానవుడు దురాత్ముడై పోతున్నాడు.

**మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనామ్.**

ఈనాడు త్రికరణశుద్ధి లేకుండా పోవటం చేత ఈ విధమైన కష్టములకు, నష్టములకు దుఃఖములకు దేశము యొక్క అశాంతికి కూడా మూలకారణమై పోతున్నది. జాతీయతా భావాన్ని మనం పెంచుకోవాలి.

**భారతీయ సంస్కృతి యొక్క విశిష్టత**

జాతీయతా సంస్కృతిని మనం అభివృద్ధి పరచుకోవాలి. జాతీయతా భావమే మానవుని హృదయమందు ఉండటం లేదు. నాదేశము, నామాతృభూమి, నాభాష అనే భావము మానవులలో ఆవిర్భవించాలి.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష**

srisathyasaivachanamrutam

**ఇది నామతం బనుచు ఎదగొట్టి**
**బ్రతికిన జీవి యొకండీ వసుధను గలదా!**

జాతీయతా భావము ఏమాత్రము మానవుని యందు కనిపించటం లేదు. భారతీయ సంస్కృతి ఎంత పవిత్రమైనదో గుర్తించుటకు ప్రయత్నించినప్పుడు దాని యొక్క మహత్తరమైన శక్తి మనకర్థమవుతుంది. అడుగు అడుగునా నీకు క్షణక్షణమునకు కణకణమునకు ప్రవేశించినది భారతీయ సంస్కృతి. మన దేహములో ప్రవహించే ప్రతి రక్తకణమందు భారతీయ సంస్కృతి ఉన్నది. ఒక్కొక్క కణమునందు ఒక్కొక్క రూపంగా ధరించి ఉన్నాది. కాబట్టి నీ రూపము ఒకటి కాదు. **"సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్ష సహస్రపాత్".** కాబట్టి ఈ రూపము ఒక కాలులో, చేతిలో, తలలో ఉండినది కాదు. అనేకత్వముతో కూడిన ఏకత్వమే భారతీయ సంస్కృతి. ఈ unity ని మనం చక్కగా కాపాడుకోవాలి. దేశములు వేరువేరుగా ఉండవచ్చు.

**Countries are different, but earth is one**
**Stars are many, but sky is one**
**Jewels are many, but gold is one**
**Cows are many, but milk is one**

ఈవిధమైన సంస్కృతిని మన భారతీయ సంస్కృతి ప్రబోధిస్తూ వచ్చింది. దేశములు వేరువేరుగా ఉండవచ్చు. అన్ని దేశములకు భూమి ఆధారమైనది. అట్టి ఆధారమైన భూమితత్వాన్ని మనం విస్మరిస్తున్నాము. ఈ ప్రకృతి తత్వాన్ని మనం విస్మరించటం చేత పరమాత్మతత్వాన్ని విస్మరిస్తున్నాము. భౌతికమైన, లౌకికమైన తత్వాన్ని తప్ప పారమార్థికతత్వాన్ని యోచించటం లేదు. లౌకికమును, భౌతికమును త్యజించాలి. పారమార్థికమును విశ్వసించాలి. ఈ సత్య, ధర్మ, శాంతి, ప్రేమలే మానవతా విలువలు. ఈ విలువలు పోషించుకున్న వాడే నిజమైన మానవుడు. ఈ విలువలు అభివృద్ధి కావటానికి సాత్విక ఆహారము చాలా అవసరము.

**దురలవాట్లను దూరం చేస్తామని ప్రతిజ్ఞ చేయండి**

ప్రేమస్వరూపులారా! మీరు వేరుగా భావించకండి. మీరు కొన్ని పదార్థములు

srisathyasaivachanamrutam

ఏమాత్రం తీసుకోకూడదు. ముఖ్యంగా యీనాడు విజయదశమి. ఈనాడు మీరు ఒక ప్రతిజ్ఞ చేపట్టాలి. ఏమిటా ప్రతిజ్ఞ ధూమపానము, మద్యపానము, మాంసభక్షణ ఈ మూడింటిని త్యజిస్తే మీ హృదయంలో పవిత్రమైన భావములు ప్రవేశిస్తాయి. చాలామందికి తెలియదు. ఈ ధూమపానం వల్ల అనేక దుష్టగుణములు ప్రారంభమవుతున్నాయి. ఇంతే కాదు దుష్టరోగములు కూడా ప్రారంభమవుతున్నాయి. ఒకసారి smoke చేసేవాడు ఒక్కసారి పీల్చి తెల్లని బట్టపైన అట్లా గాలి విడచనీ పచ్చగా colour మారిపోతున్నది. అదియే cancer కి మూలకారణము. కనుక ఈనాడు smoking వల్ల ఆరోగ్యము పాడైపోతున్నది. మానసిక పవిత్రత పాడైపోతున్నది. ఇంక మద్యపానము. ఈ మద్యపానము మహా పిశాచము. తనను తానే మరపింపచేస్తుంది. తాను ఏవిధమైన పరిస్థితిలో ఉన్నాడో గుర్తించటానికి వీలుకానట్టుగా మార్పు చెందుతుంది. ఏమి మాట్లాడుతున్నాడో తనకు తెలియదు. ఇది కేవలం ఒక మత్తునిగా మారుస్తుంది. ఉన్మాదిగా మారుస్తుంది. ఉన్మత్తుని ప్రవర్తన ఏవిధంగా ఉంటుంది? కనుక మద్యపానాన్ని ఏమాత్రము చెంత చేర్చకూడదు. మాంసభక్షణ నీవే ఒక దేహము. పాంచభౌతికమైన దేహము. ఇది ఆహారముతో కూడిన దేహము. కండరములతో కూడిన దేహము. ఈ దేహం పాంచభౌతికము.

**మలినపుకొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాత సం**
**చలనము పొందుదుంప భవసాగర మీదగలేని కంప అం**
**బల పొదిలెమ్ము చూడ మనమెప్పుల దలంప దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరి పాదములాశ్రయింపవే**

ఈ మానవ దేహమే మాంసముతో కూడినదైతే తిరిగి మాంసము వేయటం. మనిషి మాంసం ఎవరైనా భుజిస్తున్నారా? ఎందువల్ల మాంసము భుజించిన దేహము కనుక ఎవరు భుజించరు. ఇది చాలా అదృష్టమైన దేహము. దీనికి పవిత్రమైన ఆహారము నందించాలి. సార్థకమైన పదార్థములు తినాలి. తద్వారా పవిత్రమైన కర్మలు ఆచరించటానికి వీలవుతుంది. మనకు good sleep రావటానికి, good thoughts రావటానికి ఆహారము చాలా అవసరము. భీష్ముడైన మహాజ్ఞాని చెడు ఆహారము చేత తాను చెడిపోయాడు.

sri sathyasai vahini / vachanamrutam

ఈ కర్మల ఫలితము చేత 56 దినములు ప్రాణముండి కూడను అంపశయ్యపై జీవిస్తూ వచ్చాడు. దృష్టి చాలా పవిత్రమైనదిగా తీసుకోవాలి. సమ్యక్‌దృష్టి, సమ్యక్ భావము, సమ్యక్ కర్మ, సమ్యక్ సాధన. ఈ పవిత్రమైన నేత్రములు మనం తీసుకోవాలి. ఈ పవిత్రమైన దృష్టి ఎక్కడనుండి వస్తుంది? సృష్టిలో మార్పులేదు. నీ దృష్టిలో ఉంటున్నాది. పవిత్రమైన భావాల వల్లనే పవిత్రమైన దృష్టి అభివృద్ధి అవుతుంది. నీదృష్టి పవిత్రమైన రీతిలో ఉండాలి. ఎవరిని చెడ్డ దృష్టితో చూడవద్దు. ఎవరి చెడ్డ విషయాలు నీవు వినవద్దు. ఎవరి దగ్గర చెడ్డ మాటలు మాట్లాడవద్దు. చెడ్డ తలంపులు తలచవద్దు. చెడ్డ పనులు చేయవద్దు. ఈవిధంగా ఉండినప్పుడు యింతకంటె పవిత్రత మరెక్కడున్నాది. మానవుడు చాలా పవిత్రమైనవాడు. మానవుడే దేవుడు. ఈ దేవునితో సమానమైన మానవుడు తనను తాను యింత మలినపు కొంపగా మార్చుకోటం ఎందుకు? దీనిని నిరర్థకమైన జీవితంగా ఎందుకు చేసుకోవాలి?

**దుష్టమార్గాన్ని వదలండి**

జంతూనాం నరజన్మ దుర్లభం అన్నారు. మానవజన్మ దుర్లభం. కానీ కొంతమంది దయాదాక్షిణ్య రహితులై రాక్షసులకంటే హీనంగా మారిపోయి మనుషులను చంపుతున్నారు. ఇవి రాక్షస కృత్యములే గానీ మానవ పనులు కాదు. నీవు మానవుడై పుట్టి రాక్షసునిగా మారిపోతున్నావు. తాత్కాలికంగా చేసే పనులు మాత్రమే చేస్తూ ఆనందిస్తున్నావు. కానీ భవిష్యత్తులో ఇవి చాలా ప్రమాదమైన ఫలితమునందిస్తుంది. కనుక ముందు వచ్చేది చక్కగా విచారణ చేసుకోవాలి.

**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలి తనమ్మను ముసుళ్ళ పండుగ**
**మసల లేవు కనుమసకలు మోమున**
**ముడుతలు బడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసిముసి నవ్వగ కసరుకొనే**

sri sathyasaivachanamrutam

**తైతై తైతై తై బొమ్మ**
**దీని తమాష చూడర తోలుబొమ్మ**

నిజంగా మనం మానవుల వలె ప్రవర్తిస్తున్నామా? లేదు కేవలం ఒక తోలుబొమ్మ వలె ప్రవర్తిస్తున్నాము. మనం తోలుబొమ్మలం కాదు. సజీవమైన స్వస్వరూపులం. దైవత్వముతో కూడిన వారము. ఇట్టి దైవాకారము కల్గిన మానవాకారాన్ని ఎందుకు మీరు దుష్టమార్గములో ప్రవేశపెడుతున్నారు. దుష్టప్రవర్తనలో ప్రవేశ పెడుతున్నారు. దుష్టమాటలలో ప్రవేశపెడుతున్నారు. ఇది మంచిది కాదు మంచిది కాదు. ఈరోజు పవిత్రమైన విజయదశమి. ఈ విజయదశమి రోజున సప్తాహము ముగిసినది. ఈ సప్తాహములో సప్తస్వరములు పవిత్రం కావాలి. సప్త లోకములు పవిత్రం కావాలి. సప్త సూత్రములు పవిత్రం కావాలి. భారతదేశమందు మన జీవితాన్ని పవిత్రం గావించుకొనే నిమిత్తమే యీ విధమైన యజ్ఞములు ప్రారంభిస్తారు. స్వార్థము, స్వప్రయోజనం కోసం చేసేవి కాదు. లోకకళ్యాణము కోసం ఆచరించేవి. అందరూ సుక్షేమంగా ఉండాలి. అందరూ ఆనందంగా జీవించాలి. ఎవరికీ మనం బాధలు కలిగించకూడదు. ఆనాడే వ్యాసుడు 18 పురాణములు వ్రాసి కట్టకడపటికి రెండు పదములలో బోధిస్తూ వచ్చాడు.

**అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనం ద్వయం**
**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం**

Help ever, hurt never ఈ రెండింటిని బోధిస్తూ వచ్చాడు. ఎవరిని మనం హింసించకూడదు. క్రిమికీటకాదులను కూడా హింసించకూడదు. ఎందుకంటే అన్నింటి యందు దేవుడున్నాడు. దీనిని పురస్కరించుకొనే త్యాగరాజు చెప్పాడు. చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమ మీర వెలసియుండే బిరుదు వహించిన రామ నన్ను బ్రోవరా అన్నాడు. కానీ యింత ప్రబోధించిన త్యాగరాజు కూడా కష్టములో సర్వము మరచిపోతుంటాడు. అనేక కష్టములు కల్గినాయి. తానీషా చాలా బాధలకు గురిచేశాడు. పాతవాసన. ఈ పాతవాసన అడుగుపడి ఉంటుంది. బయటపడింది. బయటపడి కోపం వచ్చింది. రామా! నిరంతరము నా రోమరోమము రామనామాన్ని స్మరిస్తున్నాది. క్షణక్షణము

sri sathyasai vahanamrutam

నేను రామనామాన్ని స్మరిస్తున్నాను. ఇలాంటి పరిస్థితిలో నన్ను కష్టములకెందుకు గురిచేశావు. నీలో శక్తి లేదా లేక నాలో భక్తి లేదా? కాదుకాదు. నాలో భక్తి ఉన్నది. నీలోనే శక్తి లేదు' అన్నాడు చూశారా ఈ దురాలోచన కట్టకడపటికి దోషమును భగవంతుని పైనే వేస్తుంది. నాలో భక్తి ఉన్నది. తనను తాను సమర్థించుకోటం మానవునికి సహజమే. తక్షణమే మరల ధ్యానములో కూర్చున్నాడు. ఛీ! ఛీ! ఎంతటి దుర్మార్గుడను నేను. రాముడు ఎంత శక్తి గలవాడు. నాలోనే భక్తి దోషముంటున్నాది. అప్పుడు చెబుతూ వచ్చాడు.

**కపి వారధి దాటునా? కలికి రోటిగట్టునా**
**లక్ష్మణుండు కొలచునా! లక్ష్మీదేవి వలచునా**
**సూక్ష్మబుద్ధి గల భరతుడు చూచి చూచి మొక్కునా**
**అబ్బ రామశక్తి ఎంతో గొప్పరా!**

రామా! నీశక్తి ఎంత గొప్పది? ఈ గొప్ప తనమే లేకపోతే, లక్ష్మణుడు ఎలాంటి వాడు ఆదిశేషుడు అలాంటివాడు. నీ పాదసేవ చేస్తున్నాడే. ప్రపంచమంతయు ఆశించే ఆకర్షించే లక్ష్మీదేవి నీ పాదసేవకురాలైనదే. నీలో శక్తి లేకపోతే ఆమె పిచ్చిమనిషా? కాదు కాదు నేను బుద్ధి తక్కువైపోయి ఈ విధంగా ప్రవర్తించాను. నా సత్యాన్ని నేను మర్చిపోయాను. నీ పవిత్రతను నేను మర్చిపోయాను. అపవిత్రుడను కావటం చేత నిన్ను యీవిధంగా నిందించాను. రామా! నీ గొప్పతనము మరొక చోటున్నదా! అని రాముని వర్ణించాడు. అదే విధముగా ఒకానొక సమయంలో జీసస్ శిలువ వేస్తున్నారు. ఆ బాధ భరించుకొనలేక భగవంతుడా! ఎందుకు నన్ను యీ విధముగా భాదిస్తున్నావు అన్నాడు. తక్షణమే సత్యాన్ని గుర్తించుకున్నాడు. ఇది నీ సంకల్పము పుట్టించినది నీవు. పోషించినది నీవు. రక్షించినది నీవు. నీకు ఏది యిష్టమో అదే చేసుకో. నీ యిష్టానికి విరుద్ధంగా మాట్లాడను. అది నా పద్ధతి. నిన్ను నిందించటం నా దోషమే. అని తనదోషాన్ని తాను గుర్తించుకున్న తక్షణమే ఆ శరీరవాణి పలికింది. All are one my dear son, be alike to every one అని. అదే విధముగా ప్రతి మానవుడు తన దోషాన్ని తాను గుర్తించిన తక్షణమే దైవత్వము అక్కడే సాక్షాత్కరిస్తుంది. కానీ యీనాటి మానవుడు తన దోషాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. పరులలోని దోషాన్ని వెతుకుతున్నాడు. పరులలోని దోషాలు

srisathyasaivachanamrutam

వెతకటానికి సహస్రనేత్రాలు తెప్పించుకుంటున్నాడు. పరులదోషాల్ని వెతకటానికి యిదంతా ఎందుకు? ఇన్ని నేత్రములెందుకు. నిన్ను నీవు వెతుకు, నీదోషము నీవు వెతుకు. నీ దోషాన్ని పరిహారము గావించుకో. అప్పుడే నీవు ధన్యుడైపోతావు, పుణ్యుడైపోతావు.

**హృదయాన్ని ప్రేమతో నింపుకోండి**

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా మీరు పోషించుకోవలసింది ప్రేమతత్వము ఒక్కటే. ఆ ప్రేమయందే సత్యము, శాంతి, ధర్మము సర్వము యిమిడి ఉన్నాయి. ఏ పనిచేసినా నీవు ప్రేమతో చేయి. ఏ పలుకు పలికినా సత్యముతో పలుకు. ఈ సత్యమంతా ప్రేమతో యిముడ్చు. సర్వము సత్యము, ప్రేమతో యిమడ్చాలి. అదియే నీ జీవితము యొక్క విలువ. మానవతా విలువలు ఎక్కడుంటున్నాయి. మానవుని యందే ఉంటున్నాయి. మనయందున్న విలువలు ఎక్కడో బయట వెతుకుతుంటే ఏమాత్రం మనకు లభ్యం కాదు. మన హృదయమంతా గొప్ప water tank. ఈ water tank లో ప్రేమ అనే జలమును నింపుకో పూర్తి. శబ్ద, స్పర్శ, రూప, రస గంధాదులు taps. ఈ ట్యాంకులో ప్రేమరసము నింపుకుంటే ప్రతి ట్యాపులో ప్రేమరసమే వస్తుంది. నీ హృదయములో దురాలోచనలు, దుర్గుణములు, దుచ్చేష్టలనే water నింపుకుంటే ఈ ట్యాపులలో దుర్భావములే వస్తాయి. దీనినే యద్భావం తద్భవతి అన్నారు. కనుక మన భావాన్ని ఉత్తమమైన భావంగా తీర్చిదిద్దుకోవాలి. మన కర్మలు ఉత్తమ కర్మలుగా ఆచరించాలి. మన సంకల్పములు ఉత్తమ సంకల్పములుగా అభివృద్ధి పరచుకోవాలి. Start the day with love. Fill the day with love. Spend the day with love. End the day with love. This is the way to God. ఇవి నిజమైన మానవతా విలువలు. కానీ యీనాడు మానవతా విలువలని చెబుతున్నాం పదిమందికి. కానీ ఆచరణలో శూన్యంగా కనిపిస్తున్నాది. అదే నేను బాధ పడేది. ఇన్ని వింటున్నారు ఒక్కటైనా మీరు ఆచరణలో పెట్టకూడదా? పదిమందికి బోధించే బదులు నీవు ఆచరించి సుఖపడు. నీవు పదిమందికి చెప్పే బదులు ఆచరించటానికి ప్రయత్నించు. అది లేకుండా గొప్ప పేరుగా ప్రచారము చేస్తున్నామంటే ఇది సరైనది కాదు.

**పంట పండని భూమి పది ఎకరములేల**

srisathyasaivachanamrutam

## కొంచెమైన చాలు మంచి భూమి

ఎందుకీ ప్రచారమనే పంట పండని భూములు. నీ ఆచరణ అనే దానిలో చిన్న మంచి భూమిగా పెట్టుకొంటే చాలు. ఇదే సర్వస్వము అందిస్తుంది. కనుక మనం హృదయం పవిత్రం చేసుకోవాలి. హృదయమే మనకు ప్రధానమైన క్షేత్రం. ఈ హృదయ క్షేత్రంలో ఏమాలిన్యము చేరకుండా చూచుకోండి. అప్పుడే మనం పవిత్రమైన జీవులుగా తయారౌతాం.

## స్మరణ - ఆచరణ రెండూ ఉండాలి

దివ్యాత్మస్వరూపులారా! హృదయములోని దుర్భావములు దూరం చేసుకోండి. ఆ స్థానములో పవిత్రమైన ప్రేమతత్వాన్ని నింపుకోండి. ఎన్ని ఉపన్యాసములు చెప్పి ఏమి ప్రయోజనం? ఎన్ని వేదములు చదివి ఏమి ప్రయోజనం. ఎన్ని శాస్త్రములు పఠించి ఏమి ప్రయోజనం? అన్నీ నాకు తెలుసు అనుకుంటారు చాలామంది. తెలిసినందుకు ప్రయోజనం ఏమిటి? ఒక్కటైనా ఆచరణలో పెడుతున్నామా? ఆచరణలో లేని విద్యలన్నీ నిరర్థకమైనవి. ఆచరణలో పెడితే ఒక్కటైనా చాలు సంపూర్ణంగా ఆనందాన్నిస్తుంది. మనకు రోగం వచ్చింది. రోగనివారణ కోసం అన్ని మందుల పేర్లు చెప్పుకుంటే రోగనివారణ అవుతుందా? ఆకలిగా ఉన్నాది. పంచభక్ష్య పరమాన్నమని ఉచ్చరించుకుంటే పొట్ట నిండుతుందా! లేదు లేదు. బ్యాంకులో కోట్లకొలది రూపాయలుంటున్నాయి. కోట్లకొద్దీ రూపాయలున్నాయనుకుంటే మన జేబులో ఒక్కకాసైనా వచ్చిపడుతుందా. పడదు. కనుక మనం చింతించినంత మాత్రమున ప్రయోజనం లేదు. ఇదియే హనుమంతుడు విభీషణునికి బోధించినది. విభీషణుని చూచాడు హనుమంతుడు. విభీషణుడు హనుమంతుని దగ్గర చాలా బాధపడ్డాడు. హనుమంతా ఎంత అదృష్టవంతుడవోయి నీవు. కోతి జన్మమునకు చంచలత్వము ప్రధానమైనది. అలాంటి చంచలత్వము గల్గిన కోతిని నిన్ను, దగ్గర చేర్చుకున్న రాముడు నన్ను దగ్గర ఎందుకు చేర్చుకోలేదు? ఎంతో కాలము నుండి నేను రామనామాన్ని స్మరిస్తున్నాను. కానీ నన్నెందుకు దగ్గర చేర్చుకోలేదు అని అడిగినప్పుడు చెబుతున్నాడు హనుమంతుడు. విభీషణా! నీవు రామనామం స్మరించుకోటం

srisathyasaivachanamrutam

నాకు తెలుసు. కానీ నీవు స్మరిస్తున్నావే గానీ ఆచరిస్తున్నావా? ఎన్ని విధముల స్మరించి ప్రయోజనం ఏమిటి? నీవు ఆచరించు. నీది ఆచరణలో లేదు. కేవలం మానసికంగా చింతిస్తున్నావు. రామనామాన్ని స్మరించినంత మాత్రమున ప్రయోజనం కాదు. రా-ఆత్మ. మ-అనగాచేరటము. ఆత్మ అనే దానిలో మ అనేది చేరితే యిది రామ అవుతుంది. రామనామము స్మరిస్తున్నావు కానీ రామ చర్యలు పాటించు. అందువల్లే ఆనాడు చెప్పాడు హనుమంతుడు. ఓ విభీషణా నీకంటె గొప్పవాడు మరొకడు లేడు. ఈ సత్యాన్ని విన్న తక్షణమే తన సోదరుడైన రావణుని, కుంభకర్ణుని త్యజించాడు. పరిగెత్తిపోయి రామరామ అని సముద్రము దాటాడు. భీష్ముని కంటె విభీషణుడు చాలా గొప్పవాడు. ఎందుకంటె భీష్మునికి తెలుసు కౌరవులు చేసేది తప్పుపని అని. కానీ వారిని వదలలేదు. వారికి బోధించలేదు. వారిని సరైన మార్గములో తెప్పించలేదు. కానీ విభీషణుడు తన సోదరునికి బోధించాడు. యిది తప్పు యిది చేయకూడనిదని. బోధించిన తరువాత వినకపోతే వారిని వదలిపెట్టాడు. రాముని శరణు జొచ్చాడు. రాముని పాదములపై పడ్డాడు. నేను నీవాడను నేను నీ వాడను అని చెప్పివచ్చాడు. లక్ష్మణుడు, జాంబవంతుడు అందరు ఉన్నారు. స్వామీ! రాక్షసుడు. రాక్షసులను మీరు నమ్మకూడదు. సోదరుడైన రావణుని వదలి మీ దగ్గరకు రావటానికి ఏదో స్వార్థము ఉన్నాది. కనుక యితనిని తక్షణమే వెనుకకు పంపించమన్నాడు అప్పుడు రాముడు చెప్పాడు.

**'నీవాడని ఒక పరి అనిన ఏవాడైన ఏలుదు వానిని'** అని

ఎవ్వరేమైనా చెప్పండి. వాడు నావాడు అని వచ్చాడు. కాబట్టి వానిని నేనేమాత్రం వదలను అన్నాడు. ఇదియే భగవంతుని కృపారసము యొక్క ప్రభావం. నేను నీవాడు అని ఒక్కసారి అంటివా నీవాడుగా బ్రతుకు. భగవంతుడు ఎప్పుడు నీ వెంటనే జంటనే కంటనే ఉండి కాపాడుతూ ఉంటాడు. కానీ ఆ విశ్వాసము మీలో ధృఢముగా లేదు. ఈ నమ్మకము చాలా ప్రధానమైనది.

**నమ్మకమను రెండు నయనమ్ములే లేని**
**అంధులైరి నేడు అవనియందు**

sri sathyasai vahanamrutam

**తాము చూడకున్న దైవంబు లేడొకో**
**తమకు లేదు గాని మనకు లేదే**

మనం అంధులం కాకూడదు. నమ్మి ఆచరించి ఆనందించాలి. ఆచరణలో మనం పడేటప్పటికి అన్ని విధాలా తానే చూచుకుంటాడు. ఆ నమ్మకాన్ని మనం బలపరచుకొని, దురభ్యాసములు దూరం చేసుకుని, సత్సంగమములో చేరి, సద్భావములు పెంచుకొని, సచ్ఛింతనలో నిల్చి, సర్వీసు చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 01-10-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam